క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు

సంతమాగులూరు(అద్దంకి): రోడ్డు ప్రమాదంలో ఇరువురికి తీవ్రగాయాలైన ఘటన మండలంలోని వెల్లలచెరువు గ్రామంలో సోమవారం జరిగింది. అందిన వివరాల మేరకు.. జీ తేజ, డీ కోటేశ్వరరావు బైకుపై వినుకొండ వెళ్తున్నారు. ఈ క్రమంలో వెల్లలచెరువు వద్ద కారు బైకును ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని స్థానికుల సమాచారం మేరకు 108 అంబులెన్స్‌లో నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు.

నాణ్యమైన పొగాకు తీసుకురావాలి

యద్దనపూడి: రైతులు నాణ్యమైన పొగాకును మాత్రమే కొనుగోలు కేంద్రాలకు తీసుకువెళ్లాలని వ్యవసాయాధికారి కుమారి రైతులకు సూచించారు. సోమవారం యద్దనపూడి, గన్నవరం, అనంతవరం, గ్రామాల్లో పర్యటించి రైతులకు గ్రేడింగ్ విధానంపై అవగాహన కల్పించారు. రైతులు కొనుగోలు కేంద్రాలకు వెళ్లే ముందు పచ్చాకు, గుల్ల ఆకు, బూజు పట్టిన ఆకులు ఉన్నవాటిని తీసుకు వెళ్లకూడదని సూచించారు. అలాంటి ఆకులు ఉన్న చెక్కలను తిరిగి వెనక్కి పంపుతామన్నారు. 20 శాతం కన్నా ఎక్కువ తేమ లేకుండా చూసుకొని తగిన నాణ్యత ప్రమాణాలు పాటిస్తే మంచి ధర లభిస్తుందని రైతులకు సూచించారు.

సీపీఎస్ రద్దు చేయాలని నిరసన



నిరసన తెలియజేస్తున్న అధ్యాపకులు

అద్దంకి: సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్ విధానాన్ని ప్రవేశపెట్టాలని కోరుతూ కట్టా రామకోటేశ్వరరావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. దీనిలో భాగంగా వారు భోజ విరామ సమయంలో నిరసన తెలిపారు. ఈకార్యక్రమంలో డాక్టర్ అశోక్ కుమార్, డాక్టర్ వేటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ

చీరాల అర్బన్: రోటరీ క్లబ్ ఆఫ్ క్షీరపురి చీరాల ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం చీరాల ఏరియా వైద్యశాలలోని మెటర్నిటీ విభాగంలో పేదలకు పండ్లు, పసిపిల్లలకు బట్టలు, డైపర్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో దాత క్లబ్ చార్టర్ ప్రెసిడెంట్ అడ్డగడ మల్లికార్జున ఆర్థిక సహకారంతో నిర్వహించారు. అడ్డగడ మల్లికార్జునరావు మాట్లాడుతూ క్లబ్ సభ్యుల ఆర్థిక సహకారంతో ప్రతినెల నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు నాగమల్లేశ్వరరావు,సెక్రటరీ ముప్పల వంశీకృష్ణ, రావి వెంకటరమణ, సుభాషిణి పాల్గొన్నారు.

విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ

జే.పంగులూరు: నియోజకవర్గంలో ప్రతి హైస్కూల్ విద్యార్థికి ఉచితంగా సైకిల్ అందజేస్తామని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. ఇప్పటివరకు నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలో 3 వేలకు పైగా సైకిళ్లు పంపిణీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. సోమవారం పంగులూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 316 మంది విద్యార్థులకు మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఉచితంగా సైకిళ్లను అందజేశారు.

వెంకన్నకు కూటమి గ్రహణం !

- నత్తనడకన వెంకటేశ్వరస్వామి ఆలయ పునఃనిర్మాణం
- 2022లో దేవస్థాన పునఃనిర్మాణానికి శంకుస్థాపన
- అప్పటి టీటీడీ ఛైర్మన్ చొరవతో రూ.3.6 కోట్లు నిధులు మంజూరు
- ఇప్పటికీ పూర్తికాని వైనం



నిర్మాణంలో ఉన్న వెంకటేశ్వరస్వామి ఆలయం

అద్దంకి: కలియుగ దైవం వెంకటేశ్వరస్వామికి కూటమి ప్రభుత్వ గ్రహణం పట్టింది. అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా కూడా గ్రహణం వీడకుంది. అద్దంకి పట్టణంలో రెడ్డి రాజుల కాలం నాటి వెంకటేశ్వరస్వామి ఆలయ పునః నిర్మాణం నత్తనడకన సాగుతోంది. మూడేళ్లలో పూర్తి కావాల్సిన ఆలయ నిర్మాణం ఇప్పటికీ పూర్తి కాలేదు. 75 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయి. దాంతో వెంకటేశ్వరస్వామి అలివేలు మంగ, ఆండాళ్లమ్మ అమ్మవార్లు, బాలాలయంలోనే ఉండిపోవాల్సిన దుస్థితి కలిగింది. ఇక్కడున్న ఖాళీ ప్రదేశం శిల్పుల పరికరాలు, రాళ్లతో నిండిపోవడంతో పండుగకు నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలకు చోటులేకుండా పోతోంది.

పట్టించుకోని అధికారులు..

అద్దంకి పట్టణం పురాతన చరిత్రకు సాక్ష్యంగా నిలుస్తోంది. ఇక్కడ 101 దేవాలయాలు ఉన్నట్లు చరిత్ర ద్వారా తెలుస్తోంది. కొన్ని కనుమరుగైనా, ఇప్పటికీ ఎన్నో దేవాలయాలు చెక్కు చెదరకుండా ఉన్నాయి. వాటిలో కాకానిపాలెంలోని వెంకటేశ్వర స్వామి దేవస్థానం ఒకటి. ఈ దేవస్థానం రెడ్డిరాజుల కాలం నాటిది కావడంతో శిథిలావస్థకు చేరింది. దేవదాయ శాఖ పట్టించుకోకపోవడంతో, 2021లో అప్పటి టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు, స్థానికులతో కలసి దేవాలయ పునఃనిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాల్సిందిగా కోరారు. దాంతో ఆయన అంగీకరించి రూ.3.6 కోట్లు మంజూరు చేశారు. అందులో రూ.1 కోటి స్థానికులు అందజేశారు. అంటే రూ.2.6 కోట్లు టీటీడీ నుంచి మంజూరు చేశారు. పర్యవేక్షణ కోసం పాలేనికి చెందిన ఐదుగురితో కలిపి కమిటీ వేశారు. ఆ కమిటీ కాల పరిమితి కూడా తీరిపోయింది. నూతన కమిటీని నియమించాల్సి ఉంది. దాంతో 2022లో శంకుస్థాపన చేశారు.

డిసెంబర్ నాటికైనా పూర్తయ్యేనా ?

ఈ దేవస్థాన నిర్మాణ పనులను ఓబులురెడ్డి అనే కాంట్రాక్టరు తమిళనాడుకు చెందిన శిల్పులు పది మందితో పనులు చేయిస్తున్నాడు.

నూతన ఆలయంలో వెంకటేశ్వర్లు స్వామి ప్రధాన ఆలయం, రెండు వైపులా, ఒక వైపు అలివేలు మంగ, మరో వైపు ఆండాళ్లమ్మ ఉపాలయాలను నిర్మిస్తున్నారు. ప్రహరీ, మండపంగా ప్లాన్‌ను స్థపతి ఇచ్చారు. అందులో ప్రస్తుతం ఆలయం, ఉపాలయాలు, మండపానికి స్లాబు వేశారు. ప్రహరీ, శిల్పాలు చెక్కాల్సి ఉంది. ఆలయం నిర్మాణం నత్తనడకన సాగుతోంది, ఈ సంవత్సరం డిసెంబర్ నాటికైనా ఆలయ నిర్మాణం పూర్తి చేయాలని స్థానిక పాలెం వాసులు కోరుతున్నారు.

> **ఆలయ నిర్మాణం నత్తనడకన సాగుతోంది..**
>
> వెంకటేశ్వరస్వామి ఆలయం పట్టణంలో ఇదొక్కటే. చారిత్రాత్మకంగా ప్రసిద్ధి చెందిన ఆలయం. ఇక్కడే పండుగలకు సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతుంటాయి. అప్పటి టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి ఆలయానికి నిధులు టీటీడీ ద్వారా మంజూరు చేయించారు. మూడేళ్లలో పూర్తి కావాల్సింది. ఇప్పటికీ కాలేదు, డిసెంబరు నాటికైనా పూర్తి చేసి ఇవ్వాలి.
>
> – కాకాని రాధాకృష్ణమూర్తి



సమావేశంలో మాట్లాడుతున్న గాదె మధుసూదన్‌రెడ్డి

పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

- నియోజకవర్గ ఇన్‌చార్జి గాదె మధుసూదన్‌రెడ్డి

మార్టూరు(యద్దనపూడి): వర్గ విభేదాలు వీడి వైఎస్సార్ సీపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని.. పర్చూరు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త గాదె మధుసూదన్‌రెడ్డి సూచించారు. సోమవారం మండలంలోని డేగరమూడి గ్రామంలో మండల కన్వీనర్ జంపాని వీరయ్యచౌదరి అధ్యక్షతన మండల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో మండల, గ్రామ స్థాయి కమిటీలు ఏర్పాటు కానున్నాయని గుర్తు చేశారు. ఈ తరుణంలో పార్టీ జెండా భుజాన మోసిన వారికే ప్రాధాన్యత ఇస్తామని స్పష్టం చేశారు. ఈ కమిటీలకు సంబంధించి గ్రామ, మండల స్థాయి నాయకులు అందరూ చర్చించి పేర్లు ప్రతిపాదించాలని సూచించారు. పార్టీ ప్రతిష్టతే ధ్యేయంగా కమిటీ నిర్మాణం జరుగుతుందన్నారు. చిన్నచిన్న బేధాభిప్రాయాలను పెద్దవిగా చూపుకుంటూ ఒకరిపై ఒకరు సోషల్‌మీడియా వేదికగా నిందించుకోవటం సరికాదన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే ఏ ఒక్కరికి అన్యాయం జరగదన్నారు.

వచ్చే ఎన్నికల్లో కూటమికి ఓటమి తప్పదు..

మరో మూడున్నర ఏళ్ల పాటు టీడీపీ దుష్ట రాజకీయాలను ఎదుర్కోవాల్సి ఉందని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వ అరాచకాలు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు, దాడులు, దౌర్జన్యాలు రోజురోజుకూ పెరిగిపోయాయన్నారు. కూటమి నాయకులు వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై తప్పుడు కేసులు సృష్టించి భయభ్రాంతులకు గురిచేయాలని చూసినా ఆ కష్టనష్టాలను ఎదుర్కొని మంచి నాయకుడు పుడతాడన్న అంశాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. పదవి అనేది ఒక ఆయుధం, పదవి తీసుకున్న ప్రతి ఒక్కరూ మరింత బాధ్యతగా పార్టీ గెలుపుకు కృషి చేయాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర యూత్‌వింగ్ కార్యదర్శి ఉప్పలపాటి అనిల్, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పఠాన్ కాలేషావలి, నియోజకవర్గ ఐటీ వింగ్ అధ్యక్షుడు గర్నెపూడి రవిచంద్, ఎంపీపీ బాబునాయక్, మాజీ జెడ్పీటీసీ బండి రామయ్య, మార్టూరు టౌన్ అధ్యక్షుడు అడకా గంగయ్య, మండల పార్టీ ఉపాధ్యక్షులు ఖాదర్‌బాషా, మైలా నాగేశ్వరరావు, పుట్టా వీరయ్య చౌదరి, నూకతోటి శ్యామేలు, షేక్ అజీమ్, ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గడ్డం మస్తాన్‌వలిని పరామర్శించిన గాదె



గడ్డం మస్తాన్‌వలిని పరామర్శిస్తున్న మధుసూదన్‌రెడ్డి, నాయకులు

మార్టూరు(యద్దనపూడి): అనారోగ్య కారణాలతో ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర ముస్లిం మైనార్టీ కార్యదర్శి గడ్డం మస్తాన్‌వలిని సోమవారం ఆయన నివాసానికి వెళ్లి నియోజకవర్గ సమన్వయకర్త గాదె మధుసూదన్‌రెడ్డి పరామర్శించారు. అనారోగ్యానికి గల కారణాలను అడిగి తెలుసుకొని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట నాయకులు ఉప్పలపాటి అనిల్‌చౌదరి, గర్నెపూడి సుందరరావు, రవిచంద్, బండి రామయ్య, అడకా గంగయ్య, షేక్ ఖాదర్‌బాషా, పుట్టా వీరయ్యచౌదరి, షేక్ బుజ్జి, తాళ్లూరి కోటేశ్వరరావు, తదితరులు ఉన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు



వాహన తనిఖీలు చేస్తున్న ఎస్సై ఖాదర్‌బాషా

కారంచేడు: వాడరేవు–పిడుగురాళ్ల జాతీయ రహదారిలో వాహన తనిఖీలను ముమ్మరంగా చేస్తున్నామని ఎస్సై షేక్ ఖాదర్‌బాషా తెలిపారు. సోమవారం ఆయన పర్చూరు–కారంచేడు గ్రామాల మధ్యన హైవేపై వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. వాహనాల్లో జరిగే రవాణా వ్యవస్థపైన ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. వాహనాల్లో మాదకద్రవ్యాలు, డ్రగ్స్, గంజాయి వంటివి రవాణా జరగకుండా నిరోధించేలా ఉన్నతాధికారుల ఆదేశాలతో పటిష్టంగా తనిఖీలు చేస్తున్నామన్నారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించి ప్రమాదలకు గురవ్వదన్నారు. సరైన పత్రాలు లేని వాహన యజమానులకు జరిమానాలు విధించారు.

నేడు వైఎస్సార్ సీపీ సమావేశం

యద్దనపూడి: వైఎస్సార్ సీపీ యద్దనపూడి మండల సమావేశాన్ని పర్చూరులోని పార్టీ కార్యాలయంలో నేడు నిర్వహించనున్నట్లు యద్దనపూడి మండల కన్వీనర్ రావూరి వేణుబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించనున్న సమావేశానికి పర్చూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త గాదె మధుసూదన్‌రెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు. మండలంలోని పార్టీ ప్రజాప్రతినిధులు, వివిధ హోదాల్లో ఉన్న పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

నేడు దివంగత నేత

వైఎస్సార్ వర్ధంతి

చినగంజాం: దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి పురస్కరించుకొని మండల కేంద్రం చినగంజాం రైల్వేస్టేషన్ సెంటర్‌లో మంగళవారం ఉదయం 10 గంటలకు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ పర్చూరు నియోజకవర్గ పంచాయతీ రాజ్ విభాగం అధ్యక్షుడు ఆసోది బ్రహ్మానందరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ గాదె మధుసూదన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా పేదలకు భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమానికి నియోజకవర్గంలోని అన్ని మండలాల నాయకులు, కార్యకర్తలతో పాటు మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని ఆయన కోరారు.

చీరాల అర్బన్: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ ఆదేశాల మేరకు మంగళవారం ఉదయం 10 గంటలకు స్థానిక గడియార స్తంభం సెంటర్‌లోని వైఎస్సార్ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించనున్నట్లు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి క్యాంపు కార్యాలయ ప్రతినిధులు సోమవారం తెలిపారు. కార్యక్రమానికి పార్టీ జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు, నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులు, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, వార్డు ఇన్‌చార్జులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరూ పాల్గొనాలన్నారు.

నేడు అద్దంకిలో..

అద్దంకి రూరల్: వైఎస్ రాశేఖరరెడ్డి వర్ధంతి కార్యక్రమాలు మంగళవారం అద్దంకిలో నిర్వహించనున్నట్లు పార్టీ కార్యాలయ ప్రతినిధులు సోమవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమాల్లో అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి పానెం చిన హనిమిరెడ్డి సోదరుడు పానెం నరసింహారెడ్డి పాల్గొంటారని తెలిపారు. దీనిలో భాగంగా స్థానిక 20 వవార్డులోని వైఎస్సార్ విగ్రహానికి ఉదయం 9.30 గంటలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తారు. అనంతరం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమాలకు నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

జే. పంగులూరు: మండలంలోని బూదవాడ గ్రామంలో వైఎస్సార్ యూత్ ఆధ్వర్యంలో రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వేలాది మందికి అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మంచి వ్యక్తిత్వం గల వ్యక్తి మురళి



కడియం మురళి (ఫైల్)

చీరాల అర్బన్: మృదుస్వభావి, స్నేహశీలి, మంచి వ్యక్తిత్వం ఉన్న వ్యక్తి సాక్షి విలేకరి కడియం మురళి అని పలువురు వక్తలు పేర్కొన్నారు. సాక్షి దినపత్రిక చీరాల ఆర్సీ ఇన్‌చార్జిగా పనిచేస్తూ అనారోగ్యంతో ఇటీవల మరణించిన కడియం మురళి సంతాప సభను సోమవారం చీరాల జర్నలిస్టుల ఆధ్వర్యంలో స్థానిక పేరాల పోలేరమ్మ గుడి వద్ద నిర్వహించారు. కార్యక్రమానికి చీరాలలోని పలువురు రాజకీయ ప్రజాప్రతినిధులు, జర్నలిస్టులు, శ్రేయోభిలాషులు పాల్గొని కడియం మురళి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. పాతికేళ్లుగా జర్నలిస్టుగా పనిచేసిన ఆయన మచ్చలేని వ్యక్తిగా అందరికి సుపరిచితులన్నారు. అలానే ఉమ్మడి ప్రకాశం జిల్లా ఏపీయూడబ్ల్యూజే అధ్యక్షుడిగా పనిచేసి జర్నలిస్టుల సమస్యలపై గళమెత్తారన్నారు. అందరితో కలివిడిగా ఉంటూ వార్తల ద్వారా ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారన్నారు. మురళితో తమకున్న పరిచయాలను పలువురు రాజకీయ పార్టీల నేతలు, జర్నలిస్టులు గుర్తు చేసుకున్నారు. ఆయన మరణం తీరని లోటని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సేవలు అభినందనీయం



అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు

చీరాల అర్బన్: చీరాల రెడ్‌క్రాస్ సబ్ బ్రాంచ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పలు సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఆర్డీవో టి.చంద్రశేఖర్‌నాయుడు అన్నారు. సోమవారం చీరాల రెడ్‌క్రాస్ సబ్ బ్రాంచ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబులెన్స్‌ను ఆయన ప్రారంభించారు. ఈ అంబులెన్స్ పెట్రోలు ఖర్చులతో పాటు అతి తక్కువ సర్వీస్ చార్జీలతో ప్రజలకు అందుబాటులో ఉంటుందన్నారు. అవసరమైన వారు అందరూ ఉపయోగించుకోవచ్చని తహసీల్దార్ గోపీకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ బి.శశికిరణ్, సభ్యులు పాల్గొన్నారు.

గణనాథులకు ఘన వీడ్కోలు



గుంటుపల్లిలో గణనాథుడికి గ్రామోత్సవం

బల్లికురవ: ఆరు రోజులు నిత్యపూజలు, రాత్రిళ్లు భజనలు అందుకున్న నిలువెత్తు గణనాథులకు ఇక సెలవు అంటూ సోమవారం వీడ్కోలు పలికారు. గుంటుపల్లి గ్రామంలోని అసిస్ట్ కాలనీ, కొత్తురు పంచాయతీలోని అరుణ గిరి తండాలో ఏర్పాటు చేసిన గణనాథులను ప్రత్యేకంగా అలంకరించారు. ట్రాక్టర్‌పై మేళతాళాలు డప్పు వాయిద్యాలతో గ్రామోత్సవంతో గంగమ్మ ఒడికి చేర్చారు.

సీనియర్ సిటిజన్స్ ఆధ్వర్యంలో..

కారంచేడు: మండల కేంద్రమైన కారంచేడు మాస్కో బజారు వద్ద ప్రత్యేకంగా ఈ ఏడాది రైతులు, గ్రామంలోని సీనియర్ సిటిజన్ల ఆధ్వర్యంలో వినాయక మండపం ఏర్పాటు చేశారు. సోమవారం సీనియర్స్ అందరూ గ్రామంలో ప్రత్యేక అలంకరణగా పసుపు కండువాలు ధరించి స్వామి వారి నిమజ్జన కార్యక్రమంలో ముందుండి నడిపించారు. గ్రామంలోని అనేక ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక పందిళ్ల నుంచి డీజేలు, మైక్‌లు, లైటింగ్‌లు, విచిత్ర వేషధారణలు, డాన్స్ పోటీలతో నిమజ్జనానికి తరలివెళ్లారు.

చిన్నారుల కోలాట ప్రదర్శన..

అద్దంకి రూరల్: వినాయక చవితి సందర్భంగా అద్దంకిలోని దర్శిరోడ్‌లో తిరుపతిరెడ్డి గురుస్వామి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పందిరిలో నవరాత్రుల సందర్భంగా సోమవారం రాత్రి చిన్నారులు ప్రదర్శించిన కోలాట ప్రదర్శన అందర్నీ ఆకట్టుకుంది.

చినగంజాం: మండలంలోని మోటుపల్లి, బాపయ్యనగర్, పెదంగంజాం పల్లెపాలెం వద్ద సముద్ర తీరంలో సుమారు 30కి పైగా వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఇందులో భాగంగా యువకులు రంగులు చల్లుకుంటూ, డీజే సౌండ్స్‌తో, బాణసంచాలు కాలుస్తూ ఊరేగింపు నిర్వహించారు.



నిమజ్జనానికి తరలిస్తున్న మున్నంవారిపాలెం విఘ్నేశ్వరుడు